క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



పెన్‌పహాడ్ : విరాళం అందజేస్తున్న దాత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మాచారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామాలయం నిర్మాణానికి సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన లయన్ పటేల్ నరసింహారెడ్డి–శకుంతల దంపతులు రూ.2లక్షల 50వేలు విరాళాన్ని ఆదివారం దేవాలయ కమిటీ చైర్మన్ బొల్లక బొబ్బయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పేరం మధు, దుబని రాములు, బొమ్మకంటి లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే విరాళం

తిరుమలగిరి : మండలంలోని గుండెపురి గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో నిర్మిస్తున్న కంఠ మహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50,116 విరాళం అందజేశారు.

పోషణ్ అభియాన్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యనాయక్ తండాలో ఆదివారం సూర్యనాయక్‌తండా, వీర్యనాయక్‌తండా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ద్వారా పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు, కిశోర బాలికలకు చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వాతిర వీందర్‌నాయక్, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు ఎల్.సుజాత, బాబు, ఆశకార్యకర్తలు హైమావతి, విజయ, ఫీల్డ్‌అసిస్టెంట్ పరుశురాములు, తండావాసులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బొల్లె అశోక్



నియామకపత్రం అందిస్తున్న శ్రవణ్‌కుమార్

ఆత్మకూర్–ఎస్ : మండలంలోని కందగట్ల గ్రామానికి చెందిన బొల్లె అశోక్ టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని నెమ్మికల్లులో నిర్వహించిన సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్ నియామకపత్రం అందజేశారు. అనంతరం శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ సాధనకోసం ఈనెల 30, 31న ఢిల్లీలో దీక్ష నిర్వహించనున్నట్లు, ప్రజాసామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాతకొట్ల రమేష్, బొడ్డు మల్సూర్, రాము, నాగయ్య, సైదులు, శ్రీధర్, రవి, కాటయ్య, యల్లయ్య ఉన్నారు.

స్వయం ఉపాధితో ముందుకు సాగాలి

సూర్యాపేట : యువత స్వశక్తితో ముందుకు సాగాలని, ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా ప్రతిఒక్కరూ వివిధ రంగంలో రాణించాలని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కుడకుడ రోడ్డులో ఈవెంట్స్ షోరూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫొటోగ్రఫీ రంగంలో మంచి ఆకర్షణీయమైన ఫొటోలు తీసి నాణ్యతతో ఆల్బమ్స్ వీడియోస్ అందజేసి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కూకుంట్ల లాలు, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ సలీం, జానయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గోదావరి జలాలను పెంచాలి

అర్వపల్లి : వరి పంటలు మరో 15రోజుల్లో చేతికందనున్నాయి. అయితే యాసంగి సీజన్‌కుగాను సీజన్ ప్రారంభంలోనే గోదావరి జలాలను నీటి పారుదలశాఖ అధికారులు విడుదల చేయడంతో ఈ నీటిపై ఆధారపడి మండల వ్యాప్తంగా వందలాదిమంది రైతులు పంటలను సాగు చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 25వేల ఎకరాల్లో వరిసాగు కాగా ఇందులో సగం పంటలు గోదావరి జలాలపై ఆధారపడే సాగు చేశారు. అయితే పంటల చివరి సమయంలో గోదావరి జలాలను తగ్గించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 1800క్యూసెక్కులకు పైగానే నీటిని విడుదల చేయగా వారం రోజుల నుంచి కేవలం 500క్యూసెక్కుల నీటిని మా త్రమే ఇస్తున్నారు. దీంతో ఈకొద్ది నీరు తూములకు వెళ్లక పంటలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పది రోజుల పాటు గోదావరి జలాలను పెంచాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆత్మరక్షణకు కరాటే శిక్షణ

- రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పేరుతో కార్యక్రమం అమలు
- మండలంలోని 6 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 1 కేజీబీవీలో కొనసాగిన ట్రైనింగ్
- 300మంది బాలికలకు నెలరోజుల పాటు శిక్షణ
- సద్వినియోగం చేసుకున్న విద్యార్థినులు



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ అంకిరెడ్డి శ్రీనివాస్ (ఫైల్)

అర్వపల్లి : ప్రస్తుత సమాజంలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో బాలికలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో తల్లిదండ్రులు తమపిల్లలను చదువులకోసం బయటికి పంపించాలంటేనే ఆందోళన చెందుతున్నారు. బాలికలకు చదువు ఒక్కటే సరిపోదని.. వారు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు కరాటే లాంటి సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం విద్యా శాఖ అధికారులు రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో నిపుణులైన శిక్షకులతో అన్ని జెడ్పీహెచ్‌ఎస్‌లు, గురుకుల పాఠశాలల్లో కరాటే తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఆయా పాఠశాలల్లో ఈ శిక్షణ తరగతులు నెల రోజుల పాటు ఇప్పించారు. అదే విధంగా వేధింపులు, దాడులు జరిగే క్రమంలో వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు.

మండలంలో 300మంది బాలికలకు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని కొమ్మాల, పర్సాయపల్లి, తిమ్మాపురం, అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు అర్వపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన 300మంది బాలికలకు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు కరాటే మాస్టర్లు ఆయా పాఠశాలలకు వెళ్లి బాలికలకు శిక్షణలో తర్ఫీదు గావించారు. 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ 2022–23'పేరిట ఈ కరాటే శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణ తమకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందని, మాలో ధైర్యం పెరిగిందని బాలికలు చెబుతున్నారు.

ఎంతో ధైర్యంగా ఉంది



కరాటే శిక్షణలో మమ్ములను మేమే రక్షించుకోగలమనే నమ్మకం పెరిగింది. అలాగే ఈ శిక్షణతో ఎంతో ధైర్యం వచ్చింది. ఇలాంటి శిక్షణ ప్రతినెలా ఇస్తే ఎంతో బాగుంటుంది. బాలికలకు నమ్మకం కూడా ఏర్పడుతుంది.

– దీక్షిత, విద్యార్థిని, జెడ్పీహెచ్‌ఎస్ అర్వపల్లి

చురుకుదనం పెరిగింది



కరాటే శిక్షణతో మాకు ఆటపాటలతో పాటు చదువులోనూ చురుకుదనం పెరిగింది. అలాగే క్రమశిక్షణ కూడా ఏర్పడుతుంది. ఈశిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– భాను, విద్యార్థిని, అర్వపల్లి

7పాఠశాలల విద్యార్థినులకు శిక్షణ ఇప్పించాం



ప్రభుత్వ ఆదేశానుసారం జాజిరెడ్డిగూడెం మండలంలోని ఆరు జెడ్పీహెచ్‌ఎస్, ఒక కేజీబీవీకి చెందిన 300మంది బాలికలకు నెలరోజులు పాటు కరాటేలో శిక్షణ ఇప్పించాం. కరాటే మాస్టర్‌కు ప్రతి పాఠశాల నుంచి రూ.5వేల చొప్పున వేతనం చెల్లిస్తూ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాం.

– బి.బాలునాయక్, ఎంఈఓ

ధర్మభిక్షం ఆశయ సాధనకు ఉద్యమించాలి



సూర్యాపేటలో ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు రాంబాబుగౌడ్



ఆత్మకూర్ ఎస్ : ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్–ఎస్ : గౌడల హక్కుల సాధనకు పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతి యువకుడు ఉద్యమించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నెమ్మికల్లులో నిర్వహించిన గౌడ జన హక్కుల పోరాట సమితి నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొమ్మగాని ధర్మభిక్షం 92వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణగౌడ్ మాట్లాడారు. గౌడలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం మోపెడ్ బైక్‌లు ఇవ్వాలని, తాటి చెట్టు ఎక్కే మిషన్‌లు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ మండలాలలో నియమించిన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చొగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్, చొగోని వెంకటేశ్వర్లుగౌడ్, జిల్లా కార్యదర్శి దంతూరి సోమన్నగౌడ్, కాగింగుల శ్రీనివాస్‌గౌడ్, కప్పల రామ్మూర్తి, సున్నపు జలంధర్, మండల అధ్యక్షులు మల్లేష్‌గౌడ్, సతీష్, జానయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు ధర్మభిక్షం వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాము, నాగమణి, జయమ్మ, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో శ్రమదానం

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్ నుంచి పస్తాలకు వెళ్లే దారి పూర్తిగా గుంతలు, బురదమయంగా ఉండటంతో ఆదివారం జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలు గుంతలను మట్టితో పూడ్చివేసి, విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చదును చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు వెంకటేష్‌గౌడ్, కండె విష్ణు, మహేష్, చింటు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా డ్రైవర్లకు కొండంత అండ

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : ఆపద సమయాల్లో డ్రైవర్ల కుటుంబాలకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన డ్రైవర్స్ ప్రమాద బీమా కొండంత అండగా ఉంటుందని, ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తుమ్మలపెన్‌పహాడ్, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన డ్రైవర్ల కుటుంబాలకు డ్రైవర్ ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5లక్షల చెక్కులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది డ్రైవర్లు ప్రాణాలు కోల్పోతున్నారని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. డ్రైవర్ల సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ రూ.5లక్షల ప్రమాద బీమా అమలుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిపై ప్రజలు చర్చించాలి

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చ జరగాలని, ప్రజలు తాము పనిచేసే చోట, ఇళ్ల వద్ద, పట్టణంలో పెద్దఎత్తున జరుగుతున్న అభివృద్ధిని ఇతరులకు చెప్పాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 10వ వార్డు జాహ్నవి టౌన్‌షిప్ నందు నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెడును చెడుగా, మంచిని మంచిగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్, కాలనీ సెక్రటరీ అశోక్, కాలనీసభ్యులు ఉన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు హేయమైన చర్య

నాగారం : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. అదానీ, అంబానీలను కాపాడేందుకే రాహుల్‌గాంధీపై వేటు వేశారని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలను చేతుల్లోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని దేశప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని, బీజేపీ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

రాహుల్ అనర్హత ప్రజాస్వామ్య విరుద్ధం

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీని అనర్హుడిగా ప్రకటించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, పాలకపక్షంపై ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాలను తట్టుకోలేక ప్రధాని నరేంద్రమోదీ అనిచివేత దోరణితో రాహుల్‌గాంధీని అనర్హుడిగా ప్రకటించే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తూ ప్రతిపక్షాల నాయకులపై దాడులు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు దేసోజు మధు, మున్నా అశోక్, రమేష్, లింగయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

తిరుమలగిరి : మున్సిపాలిటీలోని వివేకానంద విద్యామందిర్ 1997–1998బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వారు 25ఏళ్ల తర్వాత కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు మూల నవీన్‌రెడ్డి, నవీన్, వలీపాషా, యాదగిరి, రాజేష్, వేణు, నాగమల్లేష్, సమ్మయ్య, రాజు, ఎల్లాంల యాదగిరి, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, వీరయ్య, ఎండీ.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి దేవాలయం

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో సుమారు 300ఏళ్ల కిందట నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం పూర్తిగా శిథిలమైంది. దీంతో ఈ ఆలయాన్ని తొలగించి నూతనంగా నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించారు. దీంతో గ్రామానికి చెందిన వ్యాపారి గోళ్ల రమేష్–మమత దంపతులు సొంతంగా దేవాలయాన్ని పునర్నిర్మిస్తామని ముందుకొచ్చారు. సుమారు రూ.35లక్షల వరకు వెచ్చించి ఈ ఆలయాన్ని నిర్మించారు. గ్రామంలో పునఃనిర్మించిన ఆలయంలో నేటి నుంచి రెండు రోజుల పాటు మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధన, మూల మంత్ర హోమంలు, నూతన ఉత్సవమూర్తులకు జలాధివాస, ధాన్యాదివాస, ఫలాదివాస, పూర్వక చర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి. మంగళవారం హనుమత్‌హోమం, రుద్రహోమం, శాంతిపౌష్టికహోమాలు, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, పండిత సన్మానం, అన్నదాన కార్యక్రమాలు జరగనున్నాయి. కాగా భానుపురి శ్రీనివాస భజన మండలి వారిచే హనుమాన్ చాలీసా, భక్తి సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా తొలిరోజు ఉత్సవానికి ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్ హాజరుకానున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రూ.35లక్షలతో ఆలయ పునఃనిర్మాణం

గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయం పూర్తిగా శిథిలం కావడంతో గ్రామస్తుల కోరిక మేరకు తాము సొంతంగా రూ.35లక్షలు వెచ్చించి ఆలయాన్ని పునఃనిర్మించాం. తమ ఖర్చులతోనే మహాకుంభాభిషేక మహోత్సవాలను రెండు రోజులపాటు నిర్వహిస్తున్నాం. అలాగే గ్రామంలో పునఃనిర్మిస్తున్న శివాలయం కోసం కూడా తమవంతు సహకారం అందించాం.

– దాత గోళ్ల రమేష్

అవినీతి పాలన అంతం.. బీజేపీతోనే సాధ్యం



పెన్‌పహాడ్ : ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ నమోదు చేస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించాలంటే బీజేపీ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, మహ్మదాపురం గ్రామాల్లో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరి ప్రతి కుటుంబం రూ.5లక్షల ఉచిత ఆరోగ్యబీమా పొందాలన్నారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి సీఎం కేసీఆర్ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో నిరుపేదలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే అందరికి ఉచిత విద్య, వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకల రాములు, పోకల వెంకటేశ్వర్లు, చెన్ను రమణారెడ్డి, కిషన్, పేర్ల దేవలింగం, బింగి నగేష్, గుర్వయ్య, వీరన్న, శేఖర్, సుందర్ పాల్గొన్నారు.

పేదలకు భారంగా మారిన రాష్ట్ర ప్రభుత్వం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజలకు భారంగా మారిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, అల్పకాలిక్ విస్తారక్‌ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ, విద్యుత్, భూ రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెంచడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రభుత్వ అసమర్థపాలనతోనే పేపర్ లీకేజీ జరిగిందని దీంతో అనేక మంది నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అబీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, మండలాల అధ్యక్షులు పందిరి రాంరెడ్డి, పేర్వాల లక్ష్మణరావు, వెన్న శశిధర్‌రెడ్డి, పోకల రాములు, పట్టణ ప్రధాన కార్యదర్శులు తోణుకునూరి సంతోష్‌కుమార్, శివ పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా విస్మరించదన్నారు. ఆకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇచ్చే రూ.10వేల నష్టపరిహారంలో రూ.7500 కేంద్ర ప్రభుత్వానివే అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, ధరావతు శ్రీనివాస్‌నాయక్, కొణతం అప్పిరెడ్డి, జంపాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ అభినందనీయం



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ, సుధాకర్ గ్రూప్ డైరెక్టర్ మహాదేవ్

సూర్యాపేట : స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్త బుట్టలను సుధాకర్ పీవీసీ యాజమాన్యం పంపిణీ చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని వీవీఎన్‌క్లేవ్‌లో సుధాకర్ పీవీసీ సహకారంతో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేందుకు ఇంటికి మూడు బుట్టలు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహాదేవ్, మీలా వాసుదేవ్, వీవీఎన్‌క్లేవ్ కమిటీ సభ్యులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ముత్యాలమ్మ గుడి శిథిలావస్థలకు చేరడంతో సర్పంచ్ గుండ్ల కోమరయ్య ఆధ్వర్యంలో ఆదివారం నూతన దేవాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ముత్యాలమ్మకు జలబిందెలతో జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సైదులు

తుంగతుర్తి : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలుగుపల్లిలో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధిహామీ నిధులు రూ.15లక్షలతో గ్రామంలో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి వెంకన్న, ఎంపీటీసీ కవిత, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, వెంకటేశ్వర్లు, యాకూబ్, రాములు, వీరయ్య, జలేందర్, సైకిలాబ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొన్నమ్మకు ఘన నివాళి



పొన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, రైతు సమన్వయ సమితి జిల్లా డైరెక్టర్ తూముల ఇంద్రసేనారావుల మాతృమూర్తి తూముల పొన్నమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆమె దశదినకర్మకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొప్పుల వేణారెడ్డి, పిన్నెని కోటేశ్వర్‌రావు, మామిడి అంజయ్య, గుజ్జ యుగేంధర్‌రావు, గండూరి ప్రకాష్, మిర్యాల వెంకటేశ్వర్లు, పాదిల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

మహాసమ్మేళనానికి తరలిరావాలి

సూర్యాపేట : రాష్ట్రంలోని బీసీ జర్నలిస్టులను సంఘటితం చేయడమే లక్ష్యంగా బీసీ సమాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏప్రిల్ 8న నిర్వహించే మహా సమ్మేళనానికి బీసీ జర్నలిస్టులు తరలిరావాలని బీసీ టైమ్స్ చీఫ్ ఎడిటర్ సంగెం సూర్యారావు కోరారు. ఆదివారం పట్టణంలోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీసీ టైమ్స్ సీఈఓ నాగ పరిమళ ఉన్నారు.

సాంబశివుడికి ఘన నివాళి

తిరుమలగిరి : తెలంగాణ ఉద్యమకారుడు, మావోయిస్టు మాజీ కార్యదర్శి కొనపురి సాంబశివుడు 12వ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారి పరమేష్, కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమయ్య, దయాయాదవ్, కడెం మల్లయ్య, ఓర్సు మల్లయ్య పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

తిరుమలగిరి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిసోజు నరేష్ అన్నారు. ఆదివారం మండలంలోని తొండ గ్రామంలో పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎల్లాంల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా జె.కేశవులు, ప్రధాన కార్యదర్శిగా జె.ఎల్లయ్య, కార్యదర్శిగా బి.సమ్మయ్య, కోశాధికారిగా గొలుసుల వెంకన్న, సహాయ కార్యదర్శిగా ఎల్లాంల రాములు, రైతు విభాగం అధ్యక్షుడిగా పి.సోమయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, ఎంపీటీసీ జమీలాల్, బి.అరవిందరెడ్డి, వార్డుసభ్యులు ఉన్నారు.

రోడ్డు వెంట కంపచెట్ల తొలగింపు

ఆత్మకూర్–ఎస్ : మండల పరిధిలోని గట్టికల్లు – నెమ్మికల్లు గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా తాటి చెట్లు, కంపచెట్లు విపరీతంగా అల్లుకున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలయ్యారు. ఈ విషయమై గట్టికల్లు గ్రామానికి చెందిన మార్త వెంకటేష్ చెట్లు తొలగించాలని పలుమార్లు అధికారుల విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం వెంకటేష్ సొంత ఖర్చులతో జేసీబీ ఏర్పాటు చేసి కంపచెట్లను తొలగింపజేశారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

అర్వపల్లి : మండల కేంద్రంలో నేడు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ వీరప్రసాద్‌యాదవ్, వైస్‌ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్, ఉపేందర్, సర్పంచ్‌లు సునీత, ఉషారాణి, శేఖర్, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసువర్ణలక్ష్మి పండుగ

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని వట్టి ఖమ్మంపహాడ్ గ్రామంలో ఆదివారం శ్రీసువర్ణ లక్ష్మి (సవారి లచ్చమ్మ) పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రౌతు నర్సింహరావు, సర్పంచ్ కలకొండ కరుణక్యాంసన్, ఎంపీటీసీ వేములపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీటీసీ పబ్బు సైదులుగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



ఆహ్వానపత్రికను అందజేస్తున్న చైర్మన్

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 30న నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు రావాలని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావులను ఆదివారం సూర్యాపేటలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వర్లు కలిసి ఆహ్వానించారు. ఆయన వెంట గోపగాని రమేష్, బీరపూల నారాయణ తదితరులు ఉన్నారు.